క్లుప్తంగా

ఏడీకి ఆత్మీయ సన్మానం



రామారావును సన్మానిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

మద్దిపాడు: మండల పశువైద్యశాలలో ఏడీగా పనిచేసిన రామారావుకు డాక్టర్లు, వైద్యశాల సిబ్బంది, ఏహెచ్ఏలు శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పదోన్నతిపై డీడీగా నరసరావుపేటకు బదిలీపై ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా మద్దిపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ మాధవి మాట్లాడుతూ సౌమ్యుడైన రామారావు విధినిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ ప్రతి విషయం తమకు తెలియజేస్తూ చేయాల్సిన పనులు చేయిస్తూ ఉంటారన్నారు. వైద్యశాల సిబ్బంది పలువురు మాట్లాడుతూ తమను ఆయన ఎంతో ప్రేమగా సొంత మనుషులను చూసుకున్నట్లు చూసుకునేవారన్నారు. అనంతరం రామారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ వెంకట్రావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఏహెచ్ఏలు గోపాలమిత్రలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద పిల్లలకు భోజన ప్యాకెట్లు పంపిణీ



భోజన ప్యాకెట్లు అందిస్తున్న హెల్పింగ్ టీం సభ్యులు

కొత్తపట్నం: మండలంలోని ఆకుల అల్లూరు పరిధిలో ఉన్న పేద కుటుంబాల పిల్లలకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు శనివారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. జాషువా పుట్టినరోజు సందర్భంగా సొంత నిధులతో భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీం సభ్యులు డి.కేశవ, ఎం.సునీల్, బి.డానియేల్ డి.సుజిత్, ఎం.చంద్ర, ఎం.సన్నీ ఎం.రాజ్‌కుమార్, ఎం.ప్రసాద్, ఎం.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ బాలిక అదృశ్యం

ఒంగోలు టౌన్: నగరంలోని ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన ఓ బాలిక నగరంలోని ఒక ప్రైవేటు కాలేజీ లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం కాలేజీకి వెళ్లిన బాలిక సాయంత్రం తిరిగి రాలేదు. దాంతో కాలేజీకి ఫోన్ చేయగా మీ పాప ఆరోగ్యం బాగా లేదని మధ్యాహ్నం మీకు ఫోన్ చేసి చెప్పింది కదా అని ప్రిన్సిపాల్ చెప్పారు. అనుమానం వచ్చి సదరు ఫోన్‌కు కాల్ చేస్తే లిఫ్ట్ చేయట్లేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. శనివారం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

దర్శి: మునగా కోటిరత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునగా నరశింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఎస్ కళ్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించి మందులు అందజేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కొనకనమిట్ల: ప్రస్తుత సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఎస్పీ బాలయ్య అన్నారు. శనివారం మండలంలోని గనివానిపాడులో 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించారు. ప్రజలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇంటి ముందు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. సర్పంచ్ పావులూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలుద్దామని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం రెండోరోజు సంతనూతలపాడు 1, 2 సచివాలయాల పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్ సీపీ జెండాలతో నాయకులు, కార్యకర్తలతో పాటు సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నిరంతరం సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా నగదు బదిలీ చేస్తున్నారని తెలిపారు. సీఎం అందించే సంక్షేమ పథకాలు పేదలకు ఇలాగే అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తొలుత సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందిస్తూ వారి ఇళ్లలో ఎంత మందికి ఎంతెంత ఆర్థిక ప్రయోజనం కలిగిందో అడిగి తెలుసుకున్నారు. దాని ద్వారా వారి జీవితాల్లో వచ్చిన ఆర్థిక ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు డప్పు వాయిద్యాలతో పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ముస్లిం సోదరులతో సమావేశమైన ఎమ్మెల్యే టీజేఆర్.. వారి సమస్యలు విని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రెండోరోజు గడప గడపలో మొత్తం 930 ఇళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, వైస్ ఎంపీపీ టీ రాఘవమ్మ, ఎంపీటీసీ సభ్యులు బాపట్ల సుబ్బారావు, షేక్ రహంతుల్లా, పార్టీ నాయకులు తన్నీరు మోహన్‌రావు, గొడుగు మస్తాన్, కే నాగాంజనేయులు, పీ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఉత్తేజం నింపేందుకే జేసీ వారోత్సవాలు



జేసీస్ వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఒంగోలు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు

ఒంగోలు: విద్యార్థుల్లో ఉత్తేజం నింపేందుకు జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఒంగోలు రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు అన్నారు. శనివారం ఉదయం స్థానిక కాపు కళ్యాణ మండపంలో యోగాతో జేసీస్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాష్‌బాబు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడాకారుల్లో ఉత్సాహం, ఉల్లాసం నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. జేసీస్ వారోత్సవాలు విద్యార్థుల శారీరక సామర్థ్యాల పెంపునకు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. అంతేగాకుండా విద్యార్థులకు నాయకత్వ లక్షణాల పెంపు, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల్లోని జ్ఞానానికి పదును పెట్టడం కోసం పలు రకాల పోటీలు నిర్వహిస్తున్న జేసీస్ టీమ్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను జేసీస్ పూర్వ జాతీయ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ, అపెక్స్ శివకోటిరెడ్డి, శేఖర్‌బాబు, నల్లూరి జయప్రకాష్, ఏడుకొండలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు రామాంజనేయులు, జేసీస్ వారోత్సవాల చైర్మన్, జాహ్నవి కళాశాల డైరెక్టర్ జనార్దన్ మాట్లాడుతూ వారంరోజులపాటు జేసీస్ వారోత్సవాలను పండుగ వాతావరణంలో ఎలా నిర్వహించనుంది తెలియజేశారు. ఆదివారం క్రీడాపోటీలను స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. అనంతరం రెడ్ క్రాస్ కార్యాలయంలో పలువురు జేసీస్ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాల్యాద్రినాయుడు, ఆంధ్రా శ్రీను, సోమినేని సురేష్, ఆత్మకూరి బ్రహ్మయ్య, దాది ఆంజనేయులు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ ఏపీడీగా వండర్‌మ్యాన్



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో వండర్‌మ్యాన్

చీమకుర్తి: వాటర్‌షెడ్ ఏపీడీగా బాధ్యతలు స్వీకరించిన బీజే వండర్‌మ్యాన్ శనివారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల చీమకుర్తి ఎంపీడీఓగా పనిచేస్తూ పదోన్నతిపై వాటర్‌షెడ్ ఏపీడీగా నియమించబడిన సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన లక్ష్మయ్య

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తున్న గెదేలను ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దేవరాజుగట్టు శ్రీకాశినాయన ఆశ్రమం సమీపంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం.. పెద్దారవీడు సచివాలయం పరిధి సిద్దినాయునిపల్లె గ్రామానికి చెందిన మెడతోటి లక్ష్మయ్య ద్విచక్ర వాహనంపై మార్కాపురం నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. కాశినాయన ఆశ్రమం సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న గెదేలు కనిపించక పోవడంతో ఢీకొని అదుపుతప్పి కిందపడిన లక్ష్మయ్య ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మార్కాపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

శిద్దా సుధీర్‌కు రంగభూమి కళాకారుల సన్మానం



శిద్దా సుధీర్‌ను సత్కరిస్తున్న రంగభూమి కళాకారుల సంఘ సభ్యులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ప్రతి నెలా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన సభకు అధ్యక్షులుగా బేతంశెట్టి హరిబాబు వ్యవహరించారు. గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా ఆయన గురించి పలు విషయాలు తెలియజేశారు. ఈ నెలలో దివంగతులైన రంగస్థల, సినీ ప్రముఖులను గుర్తుచేసుకున్నారు. అనంతరం సుమనస రంజని గానసభ, డాక్టర్ బి.కె.దుర్గాప్రసాద్ వీణ కచేరి విశేషంగా అలరించింది. జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, సహ కార్యదర్శి ఏల్చూరి అనంతలక్ష్మి, సభ్యులు మాకా ఆంజనేయులు, దిగ్విజయ్, జాలాది మోహన్, వాకా సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు తప్పు చేశాడు శిక్ష అనుభవిస్తాడు



సింగరాయకొండ- శీలంరామును సన్మానిస్తున్న వరికూటి



సింగరాయకొండ-జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించిన గంగాడ సుజాత, డాక్టర్ బత్తుల

- శీలం రాము పాదయాత్రలో మాట్లాడిన వరికూటి

సింగరాయకొండ: చంద్రబాబు తప్పు చేశాడు, శిక్ష అనుభవిస్తాడని దీంతో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. 2024వ సంవత్సరంలో మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన పాదయాత్రలో వరికూటి పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చంద్రబాబుపై 25 కేసులున్నా వ్యవస్థలను లోబరుచుకుని పబ్బం గడిపాడని, ఈ కేసుల్లో అరెస్టు కాకుండా బెయిల్ తెచ్చుకున్నాడని గుర్తు చేశారు. కానీ ఈసారి చంద్రబాబు వ్యవస్థలను లోబరుచుకోవటానికి అవకాశం లేకుండా పూర్తి ఆధారాలతో దొరికాడని, దీంట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమేయం లేదని కేంద్ర ప్రభుత్వ సంస్థల విచారణలో చంద్రబాబు అవినీతి బయటపడిందని గుర్తు చేశారు. తాను చేసిన అవినీతికి అడ్డంగా దొరికి అరెస్టు అయిన రోజే శీలం రాము జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ పాదయాత్ర చేపట్టటం మంచి పరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా శీలం రాముకు వరికూటి పూలమాల వేసి శాలువా కప్పి అభినందించి కిలోమీటరు దూరం నడిచి పాదయాత్రలో వరికూటి పాలుపంచుకున్నారు. పార్టీ శ్రేణులు కూడా శీలం రాము పాదయాత్రలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పాత సింగరాయకొండ దేవస్థానంలో శీలం రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఒంగోలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మాదాసి వెంకయ్య జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. శీలం రాము మాట్లాడుతూ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడమే తన లక్ష్యమన్నారు. శీలం రాము యువసేన ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, చిమట శ్రీను, రాపూరి ప్రభావతి, ప్రళయకావేరి రోశయ్య, బొడపాటి అరుణ, చుక్కా కిరణ్‌కుమార్, సయ్యద్ ఖాజాహుస్సేన్, గొల్లపోతు సురేష్, అశహరి శ్రీను, చొప్పర వెంకన్న, అన్నం సాయినాథ్, శీలం ప్రవీణ్, పొన్నూరు సురేష్, షేక్ అల్లా, పెద్దకత్తుల విజయ్, చిన్నకత్తుల వెంకటేష్, కొక్కిలిగడ్డ హనుమంతరావు, సుదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

చట్టానికి చంద్రబాబు అతీతులు కాదు

- అక్రమాలకు పాల్పడినట్లు సాక్ష్యాలున్నాయి
- అందుకే అరెస్టు చేశారు
- నగర మేయర్ గంగాడ సుజాత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: చంద్రబాబు చట్టానికేమీ అతీతులు కాదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్రమాలకు పాల్పడి ప్రజాధనం కొల్లగొట్టబడినందునే చంద్రబాబును అరెస్టు చేయడం జరిగిందన్నారు. అయితే టీడీపీ శ్రేణులు పలువురు దీనిని జీర్ణించుకోలేకపోతున్నట్లు హడావిడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నారు. చంద్రబాబు నిప్పు అని చెప్పడం కాదని, చేతనైతే స్టేలు ఎత్తేయించుకుని కోర్టులో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. యువతకు శిక్షణ పేరుతో ప్రజాధనం భక్షణకు గురైతే చట్టం చర్యలు చేపట్టకూడదా అంటూ ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు ప్రశ్నించారు. సీఐడీ పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిందని, అందుకే అరెస్టు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రిగా గద్దెనెక్కడమే తరువాయి.. ఈ స్కాంకు బీజం వేశారంటే ఇంకెంత మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారో విచారణ చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్, కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్‌బాబు, శాండిల్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



అన్నవరప్పాడులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో పాల్గొన్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి సంబంధించి ఒంగోలు నగరంలో శనివారం ఇంటింటి సర్వే చేపట్టారు. స్థానిక 15వ డివిజన్ అన్నవరప్పాడులో నిర్వహించిన సర్వేలో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. అందులో భాగంగా ప్రతి వార్డు సచివాలయం పరిధిలో ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి హెల్త్ సర్వే చేపట్టి ప్రతి ఇంట్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వివరాలు సేకరించి రికార్డు చేస్తారన్నారు. అందులో భాగంగా తొలుత 15వ డివిజన్‌లో పైలెట్ సర్వే చేపట్టామన్నారు. ఇక్కడ రెండు రోజుల పాటు సర్వే చేపడతామన్నారు. ఈ సర్వేలో ఏఎన్ఎంలు, వలంటీర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి, ఇంకేమైనా అదనపు సమాచారం కావాల్సి ఉందా అనే విషయం తెలుస్తుందన్నారు. తద్వారా ఈ నెల 15 నుంచి చేపట్టనున్న ఇంటింటి ఆరోగ్య సర్వేలో పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ, డీఎంహెచ్ఓ వాణిశ్రీ, డీసీహెచ్ బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్యులు సంతోష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలను పరిశుభ్రంగా ఉంచాలి...

నగరంలోని రోడ్లు, కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులను కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అన్నవరప్పాడు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. అన్నవరప్పాడులోని 3వ లైన్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాలువ పనులను పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. రోడ్డు మార్జిన్లలో పిచ్చిమొక్కలు తొలగించనందుకు శానిటరీ మేస్త్రీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త సేకరణపై స్థానికులను ఆరా తీశారు.

మాదిగ ఉద్యోగుల మహాధర్నాను జయప్రదం చేయండి



సన్మానం అందుకున్న ఎంఈఎఫ్ ఉద్యోగులు

ఒంగోలు: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈనెల 18, 19 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు బొంత ఏసుదాసు అన్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా కార్యాలయం సంతపేటలో శనివారం ప్రారంభించారు. ఎంఈఎఫ్ సీనియర్ నాయకుడు కేఎస్ ప్రకాశరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన సుంకర ఆదాం, గుంటగాని భాస్కర్, గంధం ప్రసాద్‌లను, ఏకే విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా నియమితులైన కుడుమల అనీల కుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పిచ్చయ్య, అమ్మయ్య, భాస్కర్ రావు, జాలారావు, నిరంజన్, బాబు రావు, ఆంజనేయులు, శ్యాం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు: విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుని మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఫౌండర్ ఆఫ్ క్రాస్ బోర్డర్ బాధ్యుడు పేరిచర్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బరాజు మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అవసరమైన అన్ని టెక్నికల్ సపోర్ట్స్ కళాశాలలో ఉన్నాయని, చక్కగా ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని కోరారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ డీన్ కె.రూప అక్కేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ భవన్ మంజూరుపై హర్షం

మార్కాపురం టౌన్: పట్టణంలోని బీసీలందరికీ కలిపి బీసీ భవన్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు అన్నారు. బీసీల ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు. బీసీ భవన్‌కు పూలసుబ్బయ్య కాలనీలో 1300 గజాల స్థలాన్ని కేటాయిస్తూ ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారని పీఎల్‌పీ యాదవ్ తెలిపారు. బీసీ భవన్ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. బీపీ మండల్ యాదవ్ విగ్రహం ఏర్పాటుకు కూడా ఎమ్మెల్యేతో పాటు చైర్మన్ కూడా ఆమోదం తెలిపారన్నారు. బీసీ సంఘ నాయకులు రంగస్వామి గౌడ్, నల్లబోతుల అచ్చయ్య, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, టీపీ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ ప్రసాద్, బండారు శ్రీను, అల్లంరాజు శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీల ఆధ్వర్యంలో సన్మానం

పట్టణానికి అంబేడ్కర్ భవన్‌ను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమ్‌కుమార్, సతీష్, చెన్నకేశవులు, ఎం.శ్రీనివాసులు, వంశీ, రోజీలిడియా కలిసి సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

అఖండ భజన కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దేవస్థానం నిర్వాహకులు

యర్రగొండపాలెం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీన నీగానమే నాప్రాణం అంఖండ భజన కార్యక్రమం కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అఖండ భజన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, ప్రముఖ గాయకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. భజన బృందాలు భజన పాటలు మాత్రమే పాడాలని, ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, కార్యక్రమంలో పాల్గొనే ఉత్సాహవంతులు సెల్: 94406 46641, 94404 86901 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. 15వ తేదీ ఉదయం 5 గంటలకు ధ్వజారోహణం, స్వదేశీ గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, అఖండ నామ సంకీర్తన లాంటి కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆ కమిటీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, కందూరి రామయ్య, యక్కలి భాగ్యారావు, కందూరి కాశీనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాస్, ఎం.సుబ్బారావు, వై.వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రయ్య, కొత్తమాసు కిష్టయ్య, సూరె వెంకటస్వామి, హనుమంతరావు, టి.వీరాచారి పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు



రామదూత క్షేత్రంలో హోమాలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో విశేష పూజలు చేశారు. వెలుగొండలో శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రామదూత క్షేత్రంలో..

కొనకనమిట్లలోని రామదూత క్షేత్రంలోని శనీశ్వరాలయంలో శనివారం ప్రత్యేక హోమాలు జరిపించారు. శనీశ్వరునికి తైలాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ వేదపండితులు అకలంకం వెంకటకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉభయదాతలు యక్కంటి తురుపతిరెడ్డి, ఒద్దుల చలమారెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
ఒంగోలు
ఆదివారం ॥ 10-9-2023

వైరల్

గ్రీన్ సిగ్నల్



పట్టణాల్లోని చిన్న అపార్ట్‌మెంట్‌వాసుల నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మొక్కలు అంటే మాకు చాలా ఇష్టం. కాని స్థలం ఎక్కడిది?'

'స్థలం పెద్దగా అక్కర్లేదు. పెంచాలనే సంకల్పం ఉంటే చాలు' అంటుంది బిహార్‌కు చెందిన కమల్‌సింగ్.

ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో ఉంటున్న కమల్‌సింగ్ తన చిన్న అపార్ట్‌మెంట్ బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచుతుంది.

'వంటగది వ్యర్థాలతో కంపోస్ట్‌ను ఎలా తయారు చేయాలి?' అనే విషయం నుంచి ఏ మొక్కలను ఎలా పెంచాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వరకు... ఎన్నో విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'అర్బన్ హోమ్ వైబ్స్'కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'స్టార్ట్ వేర్ యూ ఆర్ విత్ వాటెవర్ యూ హ్యావ్' అంటున్న కమల్‌సింగ్ స్ఫూర్తితో ఎంతో మంది పట్టణ వాసులు తమ బాల్కనీలో మొక్కల పెంపకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి 'మేము సైతం' అంటున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి



మలాలాతో మహ్నూర్

పదహారు సంవత్సరాల బ్రిటీష్-పాకిస్థానీ మహ్నూర్ ఛీమ లండన్‌లోని జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్‌ఈ) లెవెల్‌లో 34 సబ్జెక్‌లలో టాప్ గ్రేడ్ సాధించి రికార్డ్ సృష్టించింది. గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రంలాంటి శాస్త్రాలు, ఫ్రెంచ్, లాటిన్... మొదలైన భాషలలో అద్భుతమైన ప్రతిభ చూపుతుంది మహ్నూర్. ఆమె ఎంచుకున్న 34 సబ్జెక్ట్‌లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్, ఫిల్మ్ స్టూడియోస్, సైకాలజీ... మొదలైన సబ్జెక్ట్‌లు ఉన్నాయి.

'ఇది మహ్నూర్‌కు మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఈతరంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అని ట్వీట్ చేశారు పాక్ మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్.

'వైద్యురాలిగా పదిమందికి సేవ చేయాలి' అనేది తన జీవిత ఆశయంగా చెబుతుంది మహ్నూర్.

ఇదిగో సారూ... నా మేక టికెటు



గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జంతువులను కుటుంబసభ్యులుగా చూసుకుంటారు. పేర్లు పెట్టి ప్రేమగా పిలుచుకుంటారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళ మేకను పెంచుకుంటుంది. ఒకరోజు ఆమె వేరే ఊరికి పోవాల్సి వచ్చింది. మేకను ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడం ఇష్టం లేక తనతో పాటు తీసుకెళ్లింది. విశేషం ఏమిటంటే మేకకు కూడా ట్రెన్ టికెట్ తీసుకుంది. ఐఏఎస్ అధికారి అవినాష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ అయింది.

'తన మేకకు కూడా టికెట్ తీసుకున్న విషయాన్ని టీటీయితో ఎంత గర్వంగా చెబుతుందో చూడండి' అని రాశారు అవినాష్.

ఇక వీడియో క్లిప్ విషయానికి వస్తే... టికెట్ చూపించమని ఆమెను టీటీయి అడుగుతాడు. 'ఇదిగో' అంటూ చూపిస్తుంది.

'నీ సంగతి సరే, మరి మేకకు టికెట్ తీసుకున్నావా?' అని సరదాగా అడుగుతాడు టీటీయి.

'అమ్మో...తీసుకోకుండా ఎలా ఉంటాను. ఇదిగో టిక్కెట్టు' అని చూపిస్తుంది.

'నేను తరచుగా రైల్లో ప్రయాణిస్తుంటాను. టికెట్ లేకుండా ట్రెన్‌లో ప్రయాణించి టీటీయికి దొరికి పోయేవారిని చాలామందిని చూస్తుంటాను. వారిని గుర్తు తెచ్చుకున్నప్పుడు ఈమె చాలా గొప్పగా అనిపిస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

కాలం కలిసి వస్తే డంప్‌యార్డ్ కూడా నందనవనం అవుతుంది!



కాలం కలిసే వస్తే... కంపు కొట్టే డంపు యార్డ్ కూడా కనుల విందు చేసే పార్క్ అవుతుంది. రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్‌లో ఒక డంప్ యార్డ్ ఉండేది. దుర్వాసన వల్ల ఆ చుట్టుపక్కల నుంచి నడిచి వెళ్లాలంటే జనాలు జడుసుకునేవారు. అలాంటి చోటుకు ఇప్పుడు జనాలు వెదుక్కుంటు వస్తున్నారు. దీనికి కారణం ఈ డంప్‌యార్డ్‌ను మున్సిపాలిటీ సిబ్బంది అందమైన పార్క్‌గా తయారుచేయడమే.

వాటర్ ఫౌంటెన్‌లు, పచ్చటి గడ్డితో ఈ పార్క్ కనువిందు చేస్తోంది.

ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ సవిత దావియా ఈ క్లిప్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

'ఎన్నో పట్టణాలలో ఎన్నో డంప్‌యార్డ్‌లు భయపెడుతున్నాయి. అవి కూడా ఇలాగే నందనవనంలా మారితే ఎంత బాగుంటుంది' అంటూ ఒక ఎక్స్ యూజర్ స్పందించాడు.

అటు చూస్తే జవాన్ ఇటు చూస్తే ఆఫీస్...



అటు చూస్తే బాదం హల్వా ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ... అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆ బెంగళూరు ఐ.టి ఉద్యోగికి కూడా సంకటం వచ్చింది. ఒకవైపు జవాన్ రిలీజ్. మరోవైపు సాఫ్ట్‌వేర్ డ్యూటీ. చివరకు అతను రెండూ చేశాడు. వైరల్ అయ్యాడు.

బెంగళూరులోనే ఇటువంటివి జరుగుతుంటాయి. మొన్నా మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ర్యాపిడో బైక్ వెనుక కూచుని ఆఫీస్‌కు వెళుతూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే బైక్ మీదే ల్యాప్‌టాప్ తెరిచి లాగిన్ అయ్యి డ్యూటీ మొదలెట్టేశాడు. భారీ ట్రాఫిక్ వల్ల క్యాబుల్లో ఎక్కగానే ల్యాప్‌టాప్‌లు తెరిచే వాళ్లూ అక్కడ ఎక్కువే. ఇప్పుడు ఒక ఉద్యోగి ఏకంగా సినిమా హాల్లోనే ల్యాప్‌టాప్ తెరిచాడు. ఏం చేస్తాడు మరి? షారుక్ ఖాన్ ఫ్యాన్. ఫస్ట్ డే ఫస్ట్ షో. సరిగ్గా ఆ టైమ్‌కే లాగిన్ అవ్వాలి. అందుకని థియేటర్‌లో ల్యాప్‌టాప్‌లో వేళ్లు టిక్కుటక్కుమంటుంటే కళ్లు సినిమాకు అంకితం అయ్యాయి. వెనుక కూచున్న ఒక వ్యక్తి ఇది ఫొటో తీసి ఇన్‌స్టాలో పెడితే లక్షల కొద్దీ వ్యూస్ వచ్చాయి. 'బెంగళూరులో ఇక పని చేయకుండా వదిలేసిన చోటు ఏదీ లేదు' అని కామెంట్లు చేస్తూ ఏడవలేక నవ్వుతున్నారు.

కథక్ నుంచి తీన్మార్ వరకు





బెల్జియన్ కంటెంట్ క్రియేటర్ ఈడీ పీపుల్ వివిధ ప్రాంతాలలో లోకల్స్‌తో కలిసి చేసే డ్యాన్స్ వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా ఫేమ్ అయ్యాయి. ఏదైనా ప్రాంతానికి వెళ్లిన పీపుల్ స్థానికులను 'మీకు ఇష్టమైన డ్యాన్స్ ఏమిటి?' అని అడగడమే కాదు 'నాకు నేర్పించగలరా?' అని రిక్వెస్ట్ చేసి ఓపిగ్గా నేర్చుకుంటాడు.

అలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లను నేర్చుకుంటూ, స్థానికులతో పోటీ పడి డ్యాన్స్ చేస్తుంటాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

తాజాగా మన దేశానికి సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు చేసి 'వారేవా' అనిపించుకున్నాడు.

'మీ డ్యాన్స్ చూస్తుంటే భారతీయ పౌరసత్వం ఇవ్వాలనిపిస్తుంది'

'మా దేశంలోని కొన్ని అద్భుతమై డ్యాన్స్‌లను మిస్ అయ్యారు. వాటిని కూడా చేస్తే బాగుంటుంది' అంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈడీ పీపుల్ షేర్ చేసిన డ్యాన్స్ వీడియోలపై నెటిజనులు స్పందించారు.

హెల్త్



చాలారకాల వైరల్ జ్వరాల్లాగే డెంగీ కూడా తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) వ్యాధి. అయితే కొంత మందిలో మాత్రం ప్లేట్‌లెట్లు ప్రమాద స్థాయి కంటే కిందికి పడిపోతాయి. అది మినహా చాలావరకు డెంగీ నుంచి దాదాపుగా అందరూ కోలుకుంటారు. పైగా ఇది వైరల్ జ్వరం కావడంతో కేవలం లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తూ... ప్లేట్‌లెట్ కౌంట్‌ను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇటీవల పెద్దసంఖ్యలో ఈ కేసులు వస్తున్న నేపథ్యంలో డెంగీపై అవగాహన కోసం ఈ కథనం.

డెంగీ నివారణ ఇలా...!



డెంగీలో రకాలు

డెంగీ రకాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. అవి... ఏ హెచ్చరికలూ లేకుండా వచ్చే డెంగీ (**డెంగీ విదవుట్ వార్నింగ్ సైన్స్**) ; కొన్ని హెచ్చరికలతో వచ్చే డెంగీ (**డెంగీ విత్ వార్నింగ్ సైన్స్**) ; తీవ్రమైన డెంగీ (**సివియర్ డెంగీ**)

లక్షణాలు

హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా వచ్చే డెంగీ : డెంగీ ఎండెమిక్ ప్రాంతాల్లో... అంటే డెంగీ ఎక్కువగా వస్తున్న ప్రాంతంలో ఇది కనిపిస్తుంటుంది. వీళ్లలో జ్వరం, వికారం/వాంతులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ర్యాష్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్ని హెచ్చరికలతో కనిపించే డెంగీ : పైన చెప్పిన లక్షణాలతో పాటు పొట్ట నొప్పి, ఊపిరితిత్తుల చుట్టూ ఉండే ప్లూరా అనే పొరలో లేదా పొట్టలో నీరు చేరడం. కొందరిలో పొట్ట లోపలి పొరల్లో రక్తస్రావం అవుతుండటం, బాధితులు అస్థిమితంగా ఉండటం, రక్తపరీక్ష చేయించినప్పుడు ఎర్ర రక్త కణాలకూ, మొత్తం రక్తం పరిమాణానికి ఉన్న నిష్పత్తి కౌంట్ పెరగడంతో పాటు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది.

తీవ్రమైన డెంగీ (సివియర్ డెంగీ) కేసుల్లో : అంతర్గత అవయవాల్లో రక్తస్రావం కారణంగా బాధితుడు తీవ్రమైన షాక్‌కు గురవుతాడు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు స్పృహకోల్పోవచ్చు లేదా పాక్షిక స్పృహలో ఉండవచ్చు. మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో కీలకమైన అవయవాలు పనిచేయకుండా పోవచ్చు.

నిర్ధారణ పరీక్షలు :

● సీబీపీ ప్రతి 24 గంటలకు ఒకసారి చేయాలి. ● నిర్ధారణ కోసం డెంగీ ఎన్ఎస్1 యాంటీజెన్ పరీక్ష అవసరం కావచ్చు.

● డెంగీ ఐజీఎమ్ అనే పరీక్ష కూడా చేయాలి. కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు వచ్చేందుకు పట్టే సమయం కూడా ఎక్కువే కాబట్టి డాక్టర్లు అవి వచ్చే వరకు ఆగకుండా... లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రారంభిస్తారు.

● పై పరీక్షలతో పాటు ఇప్పుడు ఐపీఎఫ్ (ఇమ్మెచ్యూర్ ప్లేట్‌లెట్ ఫ్రాక్షన్) అనే అత్యాధునిక పరీక్ష అందుబాటులో ఉంది. ఇది ప్లేట్‌లెట్లను ఎప్పుడు, ఎంత పరిమాణంలో ఎక్కించాలో తెలుసుకోవడంతో పాటు మరెన్నో అంశాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

టీకా ఉందిగానీ...

ప్రస్తుతం డెంగీకి టీకా (వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నప్పటికీ ఇది అందరూ తీసుకునే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. గతంలో ఓసారి డెంగీకి గురైన వారికి మాత్రమే టీకా ఇవ్వాలి. ఎందుకంటే రెండోసారి వచ్చే డెంగీ రావడం రావడమే చాలా ప్రమాదకరంగా ఉండి ప్రాణాపాయమూ కల్పించవచ్చు. కాబట్టి ఆ పరిస్థితిని నివారించేందుకు ఒకసారి డెంగీ వచ్చినవారికి మాత్రమే టీకా ఇస్తారు.

డెంగీలో మరింత ప్రమాదకరమైన కొన్ని లక్షణాలివి...

● ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో అంతర్గత అవయవాలలోకి రక్తస్రావం అయ్యే ప్రమాదంతో పాటు ఒంట్లోకి నీరు చేరడం, సివియర్ డీహైడ్రేషన్‌కు గురికావడం జరగవచ్చు. ● కొందరిలో హీమోగ్లోబిన్ కాన్సంట్రేషన్ పెరుగుతుంది. హెమటోక్రిట్ పెరుగుతుంది. దీనివల్ల రక్తం గడ్డకట్టదు. రక్తపోటు పడిపోతుంది. లివర్ ఎన్‌లార్జ్ అయి, అది దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండెస్పందనలు నిమిషానికి 60 కంటే తక్కువకు కూడా పడిపోవచ్చు. ఇలా గుండె స్పందనలు తగ్గినప్పుడు బాధితుల్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాల్సి వస్తుంది. బ్లీడింగ్, ఫిట్స్ వల్ల మెదడు దెబ్బతినే ప్రమాదమూ ఏర్పడవచ్చు. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) పూర్తిగా దెబ్బతినడానికీ అవకాశముంది.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

నివారణ ఇలా...

అన్ని వ్యాధుల్లోలాగే డెంగీలోనూ చికిత్స కంటే నివారణ ఎంతో మేలు. డెంగీని కలిగించే టైగర్ దోమ పగటిపూటే కుడుతుంది. దీని సంతానోత్పత్తి మంచి నీటిలోనే. ఈ ప్రక్రియకు పదిరోజుల వ్యవధి పడుతుంది. కాబట్టి వారంలోని ఏదో ఒక రోజు ఇంటిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే గా పాటిస్తే, దీని జీవితచక్రానికి విఘాతం కలిగి ప్రత్యుత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది.

● ఇళ్ల మూలలూ, చీకటి, చల్లటి ప్రదేశాలే టైగర్ దోమల ఆవాసం. ఇల్లంతా వెలుతురు, సూర్యరశ్మి ధారాళంగా వచ్చేలా చూసుకోవడంతో పాటు, దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు మెష్ అమర్చుకుంటే...ఒక్క డెంగీ దోమలే కాకుండా...మలేరియా, ఇతర వ్యాధులకు గురి చేసే దోమల్నీ నివారించినట్లు అవుతుంది.

● టైగర్ దోమ పెద్దగా ఎత్తుకు ఎగరలేదు. అందువల్ల కాళ్లు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులతో, ఫుల్‌స్లీవ్‌తో చాలావరకు రక్షణ కలుగుతుంది. ● నిల్వ నీటిలోనే దోమ గుడ్లు పెడ్తుంది కాబట్టి కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, బ్యారెల్స్, టైర్లు, కూలర్లు, పూలకుండీల కింద పెట్టే ప్లేట్లు మొదలైన వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. అలాగే వాడని డ్రమ్ముల్ని బోర్లించి ఉంచాలి.

● దోమలను తరిమివేసేందుకు మస్కిటో రిపలెంట్స్ వాడవచ్చు.

డెంగీ వస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిలో మినహాయించి అది అందరిలోనూ ప్రమాదకరం కాదు. కాకపోతే గర్భిణులు, చిన్నారులు, పెద్దవయసు వారికి డెంగీ సోకినప్పుడు అది తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

చికిత్స...

డెంగీ అన్నది వైరస్ కారణంగా వచ్చేది కాబట్టి దీనికి నిర్దిష్టంగా మందులేమీ ఉండవు. అందువల్ల లక్షణాలకు మాత్రమే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్) ఇస్తారు. అంటే... అవసరమైనప్పుడు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, అవసరాన్ని బట్టి రక్తాన్ని, ప్లేట్‌లెట్స్‌ను, ప్లాస్మా ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేల నుంచి 15 వేలు లేదా అంతకంటే తక్కువకు పడిపోతేనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.

పిన్‌వార్మ్ / థ్రెడ్ వార్మ్ ఇన్ఫెక్షన్ అంటే...?



కొందరు చిన్నారుల్లోని ప్రైవేట్ ప్రాంతాల్లో సన్నటి దారాల్లాంటి క్రిములు కనిపిస్తుంటాయి. మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు కనిపించే ఇవి నిజానికి మల ద్వారం నుంచి వస్తుంటాయి. అవయవ నిర్మాణపరంగా (అనటామికల్‌గా) మూత్ర విసర్జన ప్రాంతం (యురెథ్రా)... మల ద్వారానికి దగ్గరగా ఉండటంవల్ల ఇవి మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు అనిపిస్తుంటాయి. సన్నటి దారాల్లాంటి ఆకృతిని బట్టి వాటిని థ్రెడ్‌వార్మ్స్ లేదా పిన్‌వార్మ్స్ అంటారు. ఈ ఇన్ఫెక్షన్‌ను 'ఎంటిరోబియాసిస్' అని కూడా చెబుతారు.

యుక్తవయసుకు వచ్చిన (అడల్ట్) పిన్ వార్మ్స్ పెద్ద పేగుల్లో నివాసముంటాయి. ప్రతి అడల్ట్ జీవి 10,000 గుడ్లు పెడుతుంది. రాత్రివేళల్లో ఆడ పిన్‌వార్మ్ పెద్దపేగు (కోలన్) నుంచి మలద్వారం (రెక్టమ్) ద్వారా బయటకు వచ్చి పిరుదుల ప్రాంతంలో గుడ్లను వదిలేస్తుంది. ఆ గుడ్లు పిరుదుల మీద, మలద్వారం పరిసరాల్ని అంటిపెట్టుకుని ఉంటాయి. కొన్ని గుడ్లు గాల్లోకి కూడా వ్యాపిస్తాయి. వాటి నుంచి బయటకు వచ్చిన లార్వాలు బయటకు పిరుదులు, మలద్వారం, మూత్రద్వారం దగ్గర తచ్చాడుతుంటాయి. దురద కారణంగా పిల్లలు అక్కడ గీరుకున్నప్పుడు అవి గోళ్లలోకి చేరుతాయి. అవే చేతుల్ని నోట్లో పెట్టుకున్నప్పుడు అవి కడుపులోంచి మళ్లీ పెద్ద పేగుల్లోకి చేరి... ఇలా జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంటాయి. వాటి లైఫ్ సైకిల్ పూర్తి కావడానికి 4-6 వారాలు పడుతుంది.

వ్యాప్తి ఇలా...

పిల్లలు ఆడుకునే బొమ్మలు, బెడ్ షీట్స్, తువాళ్లు, లోదుస్తులు, టాయిలెట్ సీట్స్ ద్వారా తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. మరీ చిన్నపిల్లల్లో వాడిన డయపర్స్‌ను పెద్దలు ముట్టుకున్న తర్వాత వేరే పిల్లలను పట్టుకున్నప్పుడు కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అయితే ఈ పిన్‌వార్మ్ ఇన్ఫెక్షన్ పెంపుడు జంతువుల (పెట్స్) ద్వారా ఇతరులకు వ్యాపించదు.

నివారణ చర్యలివి...

● పిల్లలకు ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయించాలి. ● పిల్లలు తరచూ చేతులు శుభ్రంగా కడుక్కునేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలి. ముఖ్యంగా మలవిసర్జన తర్వాతా, మట్టిలో ఆడిన తర్వాత పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కునేలా చూడాలి. ● పిల్లల గోళ్లు ఎక్కువగా పెరగకుండా వాటిని ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి. ● పిల్లలు తమ గోళ్లు కొరక్కుండా చూడాలి. గోళ్లు కొరికే అలవాటు ఉంటే మాన్పించాలి. ● ఇంట్లో ఎవరికైనా పిన్‌వార్మ్ ఇన్ఫెస్టేషన్ ఉంటే వాళ్లతో పాటు మిగతావాళ్లూ చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఇది తరచూ తిరగబెడుతుండే అవకాశాలు ఎక్కువ.

చికిత్స... మెబెండజోల్, ఆల్బెండజోల్, పెరెంటల్ పామోయేట్ అనే మందుల్ని తగిన కోర్సులుగా ఇవ్వడం ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

పిల్లల్లో పొరబోయిందా? గొంతులో ఏదైనా ఇరుక్కుందా?



పిల్లలు తినే సమయంలో వారి గొంతులో ఏదైనా ఇరుక్కున్నపుడు పొర పోయిందని పెద్దలు అంటుంటారు. తిన్న ఆహారం కిందికి కదలడం కోసం తలపై తడుతుంటారు. కానీ గొంతులో ఇరుక్కున్న ఆహారంగానీ లేదా నాణెంలాంటి వస్తువుగానీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయునాళంలోకి పోతే చాలా ప్రమాదం. ఇలా ఆహారం ఇరుక్కున్నా లేదా ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కున్నా హాస్పిటల్‌కు వెళ్లేలోపు ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించాలి.

● పిల్లల నోరు బాగా తెరిపించి, నాలుక బాగా చాపేలా చేసి, గొంతులోకి వేళ్లుపోనిచ్చి చేతికి ఏదైనా తగులుతుందేమో చూడాలి. తగిలితే వెంటనే బయటకు తీసేయాలి. ● పిల్లాడి వెనక పెద్దలెవరైనా నిల్చుని, వారి రెండు చేతుల్నీ పొట్టచుట్టూ బిగించి, అకస్మాత్తుగా చేతుల్తో పట్టుబిగుస్తున్నట్లుగా కదిలించాలి. ఇది క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేస్తుండాలి. దాంతో పొట్ట దగ్గర ఒత్తిడి పెరిగి, గొంతులో ఇరుక్కున్నది బయటకు రావచ్చు. దీన్ని హీమ్‌లిచ్ మెనోవర్ అంటారు.

● ఇదే గనక చాలా చిన్నపిల్లల్లో / పసిపాపల్లో చేయాల్సి వస్తే... పెద్దలు కుర్చీలో కూర్చుని, చిన్నారులు తలకిందులుగా ఉండేలా, వాళ్లను తమ కాళ్లపైన బోర్లా పడుకోబెట్టాలి. ఇలా పడుకోబెట్టాక, చిన్నారుల వీపుపై అకస్మాత్తుగా ఒత్తిడి కలిగేలా నొక్కాలి. ఇది ఎలా జరగాలంటే... చిన్నారుల నడుము నుంచి వారి రెండు భుజాల మధ్య ప్రాంతంలో మృదువుగా ఒత్తిడి కలిగేలా కదిలిస్తుండాలి. ఇది కూడా క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేయాలి. ఒకవైపు పొట్ట మీద పెద్దల కాళ్ల ఒత్తిడీ, మరోవైపు వీపు మీద చేతుల ఒత్తిడి కారణంగా గొంతులో అడ్డు పడ్డ పదార్థం బయటకు వచ్చే అవకాశం ఉంది. ● ప్రథమ చికిత్సగా ఇవి చేస్తూ... వీలైనంత త్వరగా పిల్లల్ని హాస్పిటల్‌కు తరలించాలి. ఈ ప్రక్రియలతో గొంతులో ఇరుక్కున్నవి బయటకు వస్తే సరి. లేదంటే హాస్పిటల్‌లో అవసరాన్ని బట్టి ఎండోస్కోప్ వాడి, ఇరుక్కున్న పదార్థాన్ని డాక్టర్లు బయటకు తీస్తారు.